క్లుప్తంగా

క్రేన్స్‌తో ఆర్‌ఎస్సార్ ఒప్పందం



బిట్రగుంట: బోగోలు మండలం కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల బెంగుళూరు కేంద్రంగా ఎలక్ట్రానిక్స్, ఐటీ, ఎంబెడెడ్ సిస్టమ్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), తదితర అంశాలపై విద్యార్థులకు శిక్షణను ఇచ్చి బహుళజాతి సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించే క్రేన్స్ వర్సిటీతో బుధవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా క్రేన్స్ ఉపాధ్యక్షురాలు అర్పిత మిత్ర, ఆర్‌ఎస్సార్ ప్రిన్సిపల్ పీవీఎస్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్‌ఎస్సార్ విద్యార్థులకు నూతన సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమ అవసరాలకు ఉపయోగపడే నూతన అంశాలపై శిక్షణను అందించడంతో పాటు క్యాంపస్ ఎంపికల ద్వారా బహుళజాతి సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించే లక్ష్యంతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలిపారు. కళాశాల ఏవో ఆర్వీ రమణారెడ్డి, ఈసీఈ హెచ్‌ఓడీ సునీల్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ అధికారి మహేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

జలదంకి: జలదంకికి చెందిన తేరు కోటమ్మ కుటుంబానికి వింజమూరుకు చెందిన పకీరయ్య చేయూతనందించారు. కోటమ్మ కిడ్నీ వ్యాధి, ఆమె కుమార్తె రమ్య మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నారు. రమ్యకు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. కోటమ్మ కుటంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న పకీరయ్య రూ.6వేలు విలువచేసే నిత్యావసర సరుకులను బుధవారం అందజేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు దాతలు ముందుకురావాలని కోరారు.

మెప్మా అర్బన్ మార్కెట్ నేడు

ఆత్మకూరు: మున్సిపల్ బస్టాండ్ సమీపంలోని పాత ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో మెప్మా అర్బన్ మార్కెట్‌ను గురువారం ఏర్పాటు చేస్తున్నట్లు మెప్మా టీఎంసీ జీ మాధవి బుధవారం తెలిపారు. పట్టణ ప్రజలకు నాణ్యమైన వస్తువులను తక్కువ ధరలకే అందించే లక్ష్యంతో ప్రతి నెలా రెండు రోజుల పాటు మెప్మా అర్బన్ మార్కెట్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. అందులో భాగంగా ఉదయం 10 గంటల నుంచి ఏర్పాటు చేస్తున్న అర్బన్ మార్కెట్‌ను ప్రజలు ఆదరించాలని కోరారు.

విద్యార్థిని అదృశ్యం



షంషీమ్

ఆత్మకూరు: పట్టణంలోని సెంట్‌మేరీస్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న షేక్ షంషీమ్ (13) బుధవారం అదృశ్యమైంది. వివరాలు.. పట్టణానికి చెందిన బాలిక తల్లి రెండేళ్ల క్రితం కరోనాతో మృతి చెందింది. అప్పట్నుంచి మేనమామ ఇంట్లో ఉంటూ సెంట్ మేరీస్ పాఠశాలలో బాలిక చదువుకుంటోంది. బుధవారం పాఠశాలకు వచ్చిన విద్యార్థిని మధ్యాహ్నం వేళ వాచ్‌మెన్ వద్దకు వెళ్లి నిన్ను హెచ్‌ఎం పిలుస్తోందని చెప్పింది. దీంతో హెచ్‌ఎంను కలిసేందుకు వాచ్‌మెన్ వెళ్లగా బాలిక స్కూల్ నుంచి తప్పించుకుంది. వెంటనే పాఠశాల యాజమాన్యం బాలిక మేనమామకు సమాచారం అందజేయగా ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్ జిలానీ తెలిపారు. విద్యార్థినిని ఎవరైనా గుర్తిస్తే 94407 96390 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

పంచాయతీ కార్యదర్శిపై డీఎల్‌పీఓ విచారణ



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం కాటేపల్లి పంచాయతీ కార్యదర్శి ప్రసన్నపై కావలి డీఎల్‌పీఓ రాధామాధవీలత బుధవారం విచారణ చేపట్టారు. ఇటీవల పంచాయతీ కార్యదర్శిపై కలెక్టర్‌కు సర్పంచ్ విజయలక్ష్మి ఐదు అంశాలపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఎల్‌పీఓ కాటేపల్లి పంచాయతీ కార్యాలయానికి చేరుకుని రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలించి విచారణ చేపట్టారు. తుది నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు డీఎల్‌పీఓ తెలిపారు. ఆమె వెంట ఈఓపీఆర్డీ గోపిశ్రీనివాస్ ఉన్నారు.

ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు



ఆత్మకూరు: పట్టణంలో సెంటినరి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ జేడీ చంద్రపాల్ ఆధ్వర్యంలో ప్రీ క్రిస్మస్ వేడుకలను బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. తొలుత చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మహిళలు, చిన్నారులు కొవ్వొత్తులతో క్రీస్తు గీతాలను ఆలపిస్తూ క్రిస్టియన్‌పేటలోని వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. చర్చి కార్యదర్శి నందవరం ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆహ్లాదం జాడేదీ?

పుష్కరకాలం క్రితం మున్సిపాలిటీగా ఆవిర్భవించిన ఆత్మకూరులో ప్రజలు ఆహ్లాదకరంగా గడిపేందుకు నేటికీ ఎలాంటి పార్కులు లేవు. గతంలో పార్కులకు స్థలాలు కేటాయించినప్పటికీ వాటి అభివృద్ధి ప్రతిపాదనలకే పరిమితమైంది. దీంతో సాయంత్రం వేళల్లో సేదతీరేందుకు ఎక్కడా చోటు లేక పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాకింగ్ ట్రాక్‌లు సైతం లేకపోవడంతో ప్రజలు రోడ్లపైనే నడవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో ప్రమాదాలకు గురై పలువురు గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి.



బట్టేపాడు మార్గంలో పార్కుకు కేటాయించిన స్థలం

ఆత్మకూరు: గతంలో మేజర్ పంచాయతీగా ఉన్న ఆత్మకూరు 2012లో మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. మున్సిపల్ పరిధిలోని 23 వార్డులు ఉన్నాయి. వాటి పరిధిలో 10వేలకుపైగా ఇళ్లు ఉండగా, 35వేల మందికిపైగా జనాభా నివాసం ఉంటున్నారు. 2014–19 వరకు ఉన్న మున్సిపల్ పాలకవర్గం 12, 13 వార్డుల పరిధిలోని హిల్ ప్రాంతంలో ఎకరా స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు రూ.98 లక్షలు మంజూరు చేశారు. అయితే పార్కు నిర్మాణానికి నోచుకోక నిధులు మురిగిపోయాయి. అలాగే 17, 19 వార్డుల పరిధిలోని ఏసీఎస్సార్ కాలనీ ఎదురుగా పార్కు కోసం కేటాయించిన స్థలం సైతం నిరుపయోగంగా ఉంది. మున్సిపల్ పరిధిలోని టిడ్కో గృహ సముదాయంలో 1058 ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు అందజేశారు. ఇక్కడ సుమారు 4వేల మందికిపైగా నివాసం ఉంటున్నారు. టిడ్కో గృహ సముదాయంలో పార్కుకు స్థలాలను కేటాయించి వ్యాయామ సామగ్రిని సైతం అందజేశారు. అయితే అవి ఏమయ్యాయో తెలియదు. ప్రస్తుతం పార్కు స్థలాలు నిరుపయోగంగా ఉన్నాయి. వాటిని అభివృద్ధి చేయాలనే ఆలోచన అటు మున్సిపాలిటీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వం చేయడంలేదు.

డీపీఆర్ సిద్ధం చేసినా..

గతంలో మంత్రిగా మేకపాటి గౌతమ్‌రెడ్డి మున్సిపల్ పరిధిలోని మేజర్ చెరువుకట్టను అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్, చిన్నపిల్లల పార్కును నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించిన డీపీఆర్‌ను సైతం సిద్ధం చేసి మున్సిపల్ పాలకవర్గంతో ఆమోదింపజేశారు. 2020లో రాష్ట్ర స్థాయి అధికారులు వచ్చి పరిశీలించి నివేదికలను సైతం ఉన్నతాధికారులకు అందజేశారు. అయితే గౌతమ్‌రెడ్డి ఆకస్మిక మృతితో దానిని ఎవరు పట్టించుకోలేదు. పార్కుల నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు చేపట్టకపోవడంతో మురిగిపోయినట్లు సమాచారం. దీంతో వాకింగ్ ట్రాక్, పార్కుల నిర్మాణ పనులు అటకెక్కాయి. అలాగే బట్టేపాడు మార్గంలోని మున్సిపల్ పంపింగ్ స్కీం సమీపంలోని ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని 2013లో అప్పటి మున్సిపల్ కమిషనర్ భాగ్యలక్ష్మి పార్కు నిర్మాణానికి కేటాయించారు. అయితే ఇప్పటికీ పార్కు అభివృద్ధికి నోచుకోలేదు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, పాలకులు స్పందించి గత ప్రతిపాదనలను, డీపీఆర్‌లను పరిశీలించి ఆహ్లాదాన్ని అందించేలా పార్కులు, వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణ పనులు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పార్కుల అభివృద్ధికి చర్యలు

మున్సిపల్ పరిధిలోని పార్కుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నాం. అందుకు సంబంధించిన ప్రణాళికలను దేవాదాయ శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి శుక్రవారం తీసుకెళ్తున్నాం. చెరువు ప్రాంతంలో పార్కు, వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి రూ.2.1 కోట్లు మంజూరయ్యాయి. అర్బన్ గ్రీనింగ్ కార్పొరేషన్ ద్వారా టెండర్లు పిలిచి త్వరలో పనులు మొదలుపెడతాం. అలాగే రోడ్డు డివైడర్లలోని పిచ్చిమొక్కలను తొలగించి పూలమొక్కలతో సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

–సీ గంగాప్రసాద్, మున్సిపల్ కమిషనర్



ఆత్మకూరు చెరువు వద్ద వాకింగ్ ట్రాక్, పార్కు కోసం ప్రతిపాదించిన స్థలం



12, 13 వార్డుల పరిధిలో పార్కుకు కేటాయించిన స్థలం

పొదుపు మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఆత్మకూరు: చిరువ్యాపారాలు చేసే పొదుపు మహిళలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం స్వానిధి పథకం కింద ఆర్థిక సహకారాన్ని అందజేస్తోందని కెనరా బ్యాంకు ఆత్మకూరు బ్రాంచ్ మేనేజర్ వెంకటేష్ తెలిపారు. పట్టణంలోని ఏసీఎస్‌ఆర్‌కాలనీలో టీఎంసీ జీ మాధవి ఆధ్వర్యంలో పీఎం స్వానిధి–స్వాభిమానంపై పొదుపు మహిళలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ ఇప్పటికే చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్న పొదుపు గ్రూపు సభ్యులకు పీఎం స్వానిధి కింద తమ బ్యాంకు ద్వారా రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. ఆయా వ్యాపారాల నిర్వహణ, సామర్థ్యం ఆధారంగా రూ.2లక్షల వరకు రుణం అందజేస్తామని తెలిపారు. అనంతరం నలుగురు పొదుపు మహిళలకు స్వానిధి పథకం కింద రుణాలు మంజూరుకు అంగీకారం తెలిపారు. మెప్మా ఆర్పీలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కెనరా బ్యాంకు మేనేజర్

ఉపాధి పనులు కల్పించాలి

ఉదయగిరి: గ్రామాల్లో ఉపాధిహామీ పనులు కావాలని కోరిన ప్రతిఒక్కరికీ కల్పించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ అప్పాజీ అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి సిబ్బందితో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన వారి జాబ్‌కార్డులను తొలగించాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ జాబ్‌కార్డులు మంజూరు చేయవచ్చని తెలిపారు. గోకులం షెడ్లు, ఉద్యాన పంటలకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలన్నారు. పని ప్రదేశంలో కూలీలకు వసతులు కల్పించాలని సూచించారు. ఏపీఓ శ్రీనివాసరావు, ఈసీ సువార్తయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ అప్పాజీ

భూమిని కేటాయించొద్దు

ఉదయగిరి: మండలంలోని సున్నంవారిచింతలలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూమిని ఉదయగిరి వ్యవసాయ కళాశాలకు కేటాయిస్తే ఆందోళన చేపడతామని ఆ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇటీవల సున్నంవారిచింతలలోని ప్రభుత్వ భూమిని వ్యవసాయ కళాశాలకు కేటాయించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారని చెప్పారు. కళాశాలకు భూమిని కేటాయిస్తే జీవాలు, పశువులను మేపుకొంటూ జీవనం సాగించే వారికి ఇబ్బంది కలుగుతుందని గ్రామస్తులు వాపోయారు.

బ్రూసెల్లోసిస్ నివారణకు టీకాలు

వరికుంటపాడు: మండలంలోని పాడి రైతులు తమ లేగ దూడలకు ఈసుకుపోకుండా ముందస్తుగా బ్రూసెల్లోసిస్ నివారణ టీకాలను వేయించుకోవాలని ఇన్‌చార్జి పశువైద్యాధికారి ఎస్వీ రాఘవేంద్రశర్మ సూచించారు. పెద్దిరెడ్డిపల్లి పశువైద్యశాల పరిధిలో బ్రూసెల్లోసిస్ నివారణ టీకాల కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ప్రతిఇంటిని సందర్శించి పాడి రైతులకు బ్రూసెల్లోసిస్‌పై అవగాహన కల్పించి లేగ దూడలకు టీకాలు వేయాలని సూచించారు.

నార్త్‌ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ తనిఖీలు

ఉదయగిరి: స్థానిక నార్త్ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ–2 తోట శ్రీనివాసరావు బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల పఠన, అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచిచూసి విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు.



గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

అనుమసముద్రంపేట: ప్రభుత్వ పక్కాగృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ వేణుగోపాల్ గృహ నిర్మాణశాఖ అధికారులను ఆదేశించారు. మండలంలోని పెద్దబ్బీపురం, అనుమసముద్రంలోని ప్రభుత్వ లేఅవుట్లను బుధవారం ఆయన సందర్శించి గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు అవగాహన కల్పించి మార్చిలోగా నిర్మాణాలను పూర్తి చేసేలా చూడాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ ప్రసన్నకుమారి, హౌసింగ్ డీఈ గౌస్‌మొహిద్దీన్, హౌసింగ్ ఏఈ వివేక్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఖాదర్‌వలి, కంప్యూటర్ ఆపరేటర్ ప్రభాకర్, సచివాలయ సిబ్బంది మసూద్, తదితరులు ఉన్నారు.



హౌసింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ వేణుగోపాల్

30న మండల సర్వసభ్య సమావేశం

అనుమసముద్రంపేట: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 30న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రసన్న బుధవారం తెలిపారు. ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలాభివృద్ధిపై సమీక్షించనున్నట్లు చెప్పారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

అల్లూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 30న మండల సర్వసభ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రజనికాంత్ బుధవారం తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలాభివృద్ధిపై సమీక్షించనున్నట్లు చెప్పారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

వాణిజ్య సిలిండర్లనే వినియోగించాలి

సీతారామపురం: మండలంలోని హోటళ్లు, దాబాలు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, టీ దుకాణాల నిర్వాహకులు వాణిజ్య సిలిండర్లను మాత్రమే వినియోగించాలని తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. మండలంలో సుమారు 200కుపైగా వాణిజ్య కనెక్షన్లు ఉండగా, కేవలం పదహారు సిలిండర్లు మాత్రమే విక్రయాలు జరుగుతున్నాయని తెలిపారు. గృహాలకు వినియోగించే సిలిండర్లను వినియోగిస్తే దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఇసుక లారీ పట్టివేత

ఆత్మకూరు: సంగం నుంచి ప్రకాశం జిల్లా కనిగిరికి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం వద్ద బుధవారం వేకువన పట్టుకున్నట్లు ఎస్సై షేక్ జిలానీ తెలిపారు. నెల్లూరుపాళెం వద్ద జాతీయ రహదారిపై ఎస్సై సాయిప్రసాద్ తనిఖీలు చేపట్టారని చెప్పారు. ఈ క్రమంలో సంగం నుంచి వస్తున్న ఇసుక లారీ డ్రైవర్ వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బంగారం చోరీపై కేసు నమోదు

ఉదయగిరి: పట్టణంలోని ఇందిరానగర్‌కాలనీలో బంగారం చోరీ ఘటనపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఇందిరానగర్‌కాలనీకి చెందిన సకిలి జయరాజు అన్న ప్రసాద్ వివాహం డిసెంబర్ 8న జరగనుంది. ఈ నేపథ్యంలో జయరాజు తన మిత్రుడు శివకేశవతో కలిసి మంగళవారం పెళ్లికార్డులు పంచేందుకు వెళ్లాడు. రాత్రికి ఇంటికి చేరుకుని నిద్రిస్తున్న సమయంలో జయరాజు మెడలోని చైన్, చేతికి ఉన్న ఒక ఉంగరాన్ని అదేకాలనీకి చెందిన మైనర్ బాలుడు తీశాడు. మరో ఉంగరాన్ని తీసే ప్రయత్నం చేస్తుండగా జయరాజుకు మెళకువ వచ్చింది. గమనించిన బాలుడు వెంటనే పరుగులు తీసి తలుపు వేసి పరారయ్యాడు. దీంతో బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి చోరీ నగలను రికవరీ చేసి బాధితుడికి ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు.

తుఫాన్ తీరం దాటేదాక శనగ వేయవద్దు



దుత్తలూరు: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ



ఏఎస్‌పేట మండలంలో..

దుత్తలూరు: తుఫాను తీరం దాటే వరకు శనగ పంట సాగు చేపట్టవద్దని మండల వ్యవసాయాధికారి ఎస్ వెంకటసుబ్బారెడ్డి సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని సోమలరేగడలో సాగుచేసిన వరిపంటను బుధవారం ఆయన పరిశీలించారు. వరి పంటను పచ్చపురుగు ఆశించడం గమనించి నివారణకు లీటర్ నీటికి 25 మి.లీ ఫోరోఫైరిపాస్, ఎం–45 మందును కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఆయనవెంట వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట మండలం అనుమసముద్రం, పందిపాడు గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏఓ టీ రజని పాల్గొన్నారు. వరి, మెట్టపంటలను పరిశీలించి సూచనలు చేశారు. వరినాట్లు వేసే ముందు దుక్కిలో భాస్వరం ఎరువు పూర్తిగా, పొటాష్ సగం పాలు, నత్రజని 3వ భాగం వేసుకోవాలని సూచించారు. ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్‌ను దుక్కిలో వేయడం వల్ల పైరు ఏపుగా పెరుగుతుందని తెలిపారు. నాట్లు పైపైన వేయించుకోవాలని, నాటిన నాలుగు రోజుల నుంచి 30 రోజుల వరకు కయ్యల్లో నీరు పలచగా పెట్టడం వల్ల పిలకలు ఎక్కువగా వస్తాయని వివరించారు. అనంతరం మెట్టపంటలను పరిశీలించారు. ఏఈఓ కె చిరంజీవి, వై భాగ్యలక్ష్మి, వీఏఏలు రమ, ప్రసాద్ రైతులు పాల్గొన్నారు.

గోకులాల నిర్మాణాలను పూర్తి చేయండి

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలానికి ఉపాధి హామీ పథకం కింద మంజూరైన 18 గోకులాల నిర్మాణాలను వెంటనే పూర్తిచేయాలని ఎంపీడీఓ కే శ్రీనివాసరెడ్డి ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పనులపై బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. వంద రోజుల పని పూర్తిచేసుకున్న కుటుంబాల్లోని పదో తరగతి వరకు చదివిన వారి వివరాలు సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. వారి అర్హతల ఆధారంగా ప్రభుత్వం ఉపాధి శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేస్తుందని తెలిపారు. గ్రామసభలు నిర్వహించి చనిపోయిన, శాశ్వతంగా వలస వెళ్లిన, ఉద్యోగుల జాబ్‌కార్డులను తొలగించాలన్నారు. ఏపీఓ సుభాన్, ఈసీ రామ్మోహన్‌రెడ్డి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి

రైతుల సేవలో 'ఏరీస్'

చేజర్ల: ఏరీస్ ఆగ్రో లిమిటెడ్ గత 56 ఏళ్లుగా రైతులకు సాగులో అండగా నిలుస్తోందని ఆ కంపెనీ డిప్యూటీ డైరెక్టర్ జయప్రదీప్ సుబ్రహ్మణ్యన్ పేర్కొన్నారు. మండలంలోని నాగులవెలటూరు సచివాలయంలో రైతులకు ఏరీస్ కంపెనీ ఆధ్వర్యంలో ఎరువులు, పురుగు మందుల యాజమాన్య పద్ధతులపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించుకుని అందుకనుగుణంగా పంటలను సాగుచేసుకుని ఎరువులను వాడడం వల్ల అధిక దిగుబడులను సాధించవచ్చని తెలిపారు. తమ కంపెనీ రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులను అందజేస్తోందని వివరించారు. జోనల్ మేనేజర్ ఎస్వీ రత్తయ్య, ఆర్‌ఎస్‌ఎం ఎస్వీ మాధవ్, సీనియర్ మేనేజర్లు పీ వెంకటేశ్వరరావు, బీ సుందర్‌రాజు, అనిల్‌రెడ్డి, సీహెచ్ మధు, సేల్స్‌మెన్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.



బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

చేజర్ల: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ఆత్మకూరు ఐసీడీఎస్ సీడీపీఓ సుశీల తెలిపారు. చేజర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు బాల్య వివాహాలపై బుధవారం ఆమె అవగాహన కల్పించారు. బాల్యవివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. బాలికలు 18 ఏళ్లు, బాలురు 21 ఏళ్లు నిండిన తరువాతే వివాహాలు చేసుకోవాలన్నారు. అనంతరం గుడ్‌టచ్–బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు చేసుకోమని బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం ప్రసాద్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖ, ఉపాధ్యాయులు ఝాన్సీ, సింధూర, భార్గవి, సమీమ్, హైమావతి, మల్లికార్జున, కిషోర్, రహ్మతున్నీసా, అంగన్‌వాడీలు మాధవి, జ్యోతి, నిర్మల, జమీల, దేవి పాల్గొన్నారు.

విజేతలకు అభినందన



కావలి: పట్టణంలో శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో నలంద ఒలింపియాడ్ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. కావలి పట్టణ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో 9వ తరగతి విద్యార్థులు బీ తేజశ్విని, సీహెచ్ యుక్తశ్రీ విజేతలుగా నిలిచి ప్రథమ బహుమతులను అందుకున్నారు. వారిని నలంద ఒలింపియాడ్ స్కూల్‌లో చైర్మన్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

50 మందికి వైద్యపరీక్షలు

వరికుంటపాడు: మండలంలోని నార్త్ కొండాయపాళెంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వరికుంటపాడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఆయేషా 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

స్టీల్ డస్ట్‌బిన్లు మాయం



కావలి: పట్టణంలోని పలు చోట్ల ఏర్పాటు చేసిన స్టీల్ డస్ట్‌బిన్లు మాయమయ్యాయి. స్వచ్ఛసర్వేక్షణ్‌లో భాగంగా పట్టణంలోని ప్రధాన కూడళ్లలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రూ.23 లక్షలతో మూడు స్టీల్ రాడ్లు వేసి తడి, పొడి చెత్త కోసం రెండు డస్ట్‌బిన్లు అమర్చారు. ఆ తరువాత వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో ఆకతాయిలు, పాత సామగ్రి ఏరుకునే వారు స్టీల్ డస్ట్‌బిన్‌లను మాయం చేశారు. ప్రస్తుతం స్టీల్‌రాడ్లు మాత్రమే దర్శనమిస్తున్నాయి.

● డూడూ బసవన్న సందడి



సంక్రాంతి పండగలో గంగిరెద్దులది ప్రత్యేక స్థానం. అమ్మ గారికి దండం బెట్టు..అయ్య గారికి దండం బెట్టు అని యజమాని చెప్పగానే తలఊపుతూ డూడూ బసవన్నలు చేసే విన్యాసాలు లేనిదే పండగ పరిపూర్ణం కాదు. ఇంటింటికీ వచ్చి గంగిరెద్దులు చేసే విన్యాసాలు పెద్దలు, పిల్లలను ఎంతగానో అలరిస్తాయి. అలాంటి గంగిరెద్దు తన విన్యాసాలతో కావలిలో సందడి చేసింది.

–కావలి